క్లుప్తంగా

మదనపల్లె డిప్యూటీ జైలర్‌గా ఫైజూర్ రెహమాన్


ఫైజూర్ రెహమాన్

మదనపల్లె : మదనపల్లె సబ్‌జైలు డిప్యూటీ జైలర్‌గా కె.ఫైజూర్ రెహమాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం ఓపెన్ జైలులో చీఫ్ వార్డన్‌గా పని చేస్తున్న ఆయన పదోన్నతి బదిలీపై మదనపల్లె సబ్‌జైలుకు వచ్చారు. జైలు సూపరింటెండెంట్ రామచంద్రయాదవ్‌ను కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు.

ఉపాధి హామీ పథకం ఏపీడీగా మధుబాబు



ములకలచెరువు : తంబళ్లపల్లె క్లస్టర్ ఉపాధి హామీ పథకం ఏపీడీగా మధుబాబు ములకలచెరువు సీఎల్‌ఆర్‌సీ భవనంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నందకుమార్‌రెడ్డి కలికిరి క్లస్టర్‌కు బదిలీ పై వెళ్లారు. కలికిరి క్లస్టర్‌లో ఉన్న మధుబాబు ఇక్కడికి బదిలీపై వచ్చారు. క్లస్టర్‌ను జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషిచేస్తానని పేర్కొన్నారు.

ఎస్‌ఏ-వన్ పరీక్ష తేదీల్లో మార్పు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాల్సిన ఎస్‌ఏ-వన్ పరీక్షా తేదీల్లో మార్పులు జరిగాయని ఎంఈఓ నారాయణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమాలు ఉన్నందున రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 24 నుంచి పరీక్షలు జరుగుతాయని ఎంఈఓ పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కేసీ పల్లె విద్యార్థిని


అనూష

రామసముద్రం : రాష్ట్ర స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు రామసముద్రం మండలం కేసీపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని అనూష ఎంపికై నట్లు హెచ్‌ఎం జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఇటీవల గంగాధర నెల్లూరు జెడ్పీహెచ్‌ఎస్ నెల్లేపల్లెలో జరిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ -14 జిల్లా వాలీబాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారని చెప్పారు. ఈ నెల 9, 10, 11వ తేదీల్లో అరకులో జరగబోయే అండర్-14 వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందన్నారు. ఎంపిక పట్ల హెచ్‌ఎంతో పాటు పీఈటీ గాయత్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఇద్దరు ఎంపిక


రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ రాధారాణి

పీలేరురూరల్ : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు స్థానిక జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ రాధారాణి తెలిపారు. బుధవారం విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుపతిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్ 17 విభాగంలో ట్రిపుల్ జంప్ పోటీలో పదో తరగతి విద్యార్థిని బి. కరుణ మొదటి స్థానం, డిస్కస్ త్రో పోటీలో ఎస్. నిత్య మొదటి స్థానం సాధించి గుంటూరు జిల్లా పల్నాడులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీ అమరావతి పాల్గొన్నారు.

నేడు ఉపాధి పనులపై బహిరంగ సభ

పెద్దతిప్పసముద్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం ఉపాధి పనులపై బహిరంగ సభ జరుగుతుందని ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి, ఏపీఓ తిరుపాలప్ప తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి నెలాఖరు వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీకి సంబంధించి సభ జరుగుతుందన్నారు. గత ఏడాది నుంచి మండలంలో 2,425 పనులు చేపట్టగా ఇందులో 703 పనులు పూర్తి అయ్యాయన్నారు. వీటికి మొత్తం రూ.5.02 కోట్ల నిధులు ఖర్చు చేశామన్నారు. ఇందులో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్ రూపంలో రూ.4.90 కోట్ల నిధులు ఖర్చు చేశామన్నారు.

సౌకర్యాల కల్పనే లక్ష్యం

రామాపురం : ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రామాపురంలో రూ.18 లక్షల ఎంపీ మిథున్‌రెడ్డి నిధులతో (ఎంపీ ల్యాడ్స్) ఆర్టీసీ బస్‌షెల్టర్ నిర్మాణ పనుల భూమిపూజలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

- పేదల ఆరోగ్యానికి భరోసా.. జగనన్న ఆరోగ్య సురక్ష
- పండుగలా ఆరోగ్య సురక్ష ముగింపు కార్యక్రమం, ర్యాలీ
- దేశానికే రోల్‌మోడల్‌గా జగనన్న పాలన
- ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- నియోజకవర్గంలో ఆరోగ్యసురక్ష శిబిరాల్లో 33,934 మందికి చికిత్స


జగనన్న ఆరోగ్య సురక్ష బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా


సమావేశానికి హాజరైన ప్రజలు

మదనపల్లె : రాష్ట్ర ప్రజల ఆరోగ్యం బాగుండాలని, పేదల బతుకులు బాగుపడాలని, విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ... ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకెళుతున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ముగింపు సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ, జెడ్పీ హైస్కూల్‌లో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట జగనన్న ఆరోగ్య సురక్ష ముగింపు ర్యాలీని ఎమ్మెల్యేతో పాటు, ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ, డీఎస్పీ కేశప్ప, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం జెండా ఊపి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మెప్మా, స్వయం సహాయకసంఘాల మహిళలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, వైద్య, మున్సిపల్ సిబ్బందితో కలిసి భారీ ర్యాలీగా బయలుదేరి టౌన్ బ్యాంక్ సర్కిల్, చిత్తూరు బస్టాండ్, నెహ్రూబజార్, బెంగళూరు బస్టాండ్, శ్రీకృష్ణదేవరాయసర్కిల్, బాలికల జూనియర్ కళాశాల మీదుగా జెడ్పీ హైస్కూల్‌లోని సభాప్రాంగణానికి చేరుకున్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ...భారతదేశ చరిత్రలో మరే రాష్ట్రంలో జరగని విధంగా ప్రజారోగ్యం కోసం ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగనన్న పాలనలో ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. దేశమంతటా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న సంక్షేమ పథకాలు, జగనన్న పాలన, జరిగిన అభివృద్ధిపైనే చర్చించుకుంటున్నారన్నారు. ఎన్నికల సమయంలో నవరత్నాల పేరుతో కేవలం రెండుపేజీల మేనిఫెస్టో ప్రకటించిన జగనన్న అధికారంలోకి వచ్చిన నాలుగన్నరేళ్లలో 99శాతానికి పైగా పూర్తిచేసి, అందరి జీవితాల్లో వెలుగులు తెచ్చారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత పెద్ద ఎత్తున దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్నలా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎవరి సిఫారసు లేకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ అవుతున్నాయన్నారు. రానున్న ఐదునెలల్లో జరగనున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటే, ఇప్పుడు జరిగిన మంచికి రెండింతలు మించి అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తారన్నారు. ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ.. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఎంహెచ్‌ఓ కొండయ్య మాట్లాడుతూ.. మదనపల్లె నియోజకవర్గంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను 33,934 మంది లబ్ధిదారులు ఉపయోగించుకున్నారని, కంటి వెలుగు కింద 4,154 మంది పరీక్షలు చేయించుకున్నారన్నారు. బీపీ, షుగర్, అనీమియాకు సంబంధించి పరీక్షలు నిర్వహించామన్నారు. సమస్యలున్న వారిని కార్పొరేట్, ప్రభుత్వ ఆస్పత్రులకు సిఫార్సుచేసి వైద్యసేవలు అందేలా చూశామన్నారు. సమావేశం అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనశాలను సందర్శించారు. గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో మహిళలను ఆశీర్వదించి, చిన్నారులకు అన్నప్రాశనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు జింకా చలపతి, నూర్‌ఆజం, కమిషనర్ కె.ప్రమీల, డీఎల్‌డీఓ లక్ష్మీపతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీ, ఎంపీడీఓ భానుప్రసాద్, కౌన్సిలర్లు, మండల కన్వీనర్ దండు కరుణాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగుచంద్ర, శీలం రమేష్, దండు రామాంజులు, షరీఫ్, గుండ్లూరు రఫీ, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, తట్టి శ్రీనివాసులురెడ్డి, కేశవరెడ్డి, వెంకటరమణారెడ్డి, బండి మనోహర్, రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోతబోలు నాగరాజ, డిష్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

కలికిరి : మండలంలో గురువారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు ఎందుకు రాష్ట్రానికి జగన్ అవసరం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం అద్దవారిపల్లి, 10న గుండ్లూరు, 14న కలికిరి-1, 15న కలికిరి-3, 16న మహల్, 17న మర్రికుంటపల్లి, 20న పల్లవోలు, 21న పత్తేగడ, 22న చీకటిపల్లి, 23న గుట్టపాళెం గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు.

కేవీపల్లె : మండలంలో గురువారం నుంచి నిర్వహించనున్న వై ఏపీ నీడ్స్ జగన్ (సంక్షేమ పథకాల బోర్డుల ఆవిష్కరణ) కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి కోరారు. మండలంలోని పది గ్రామ సచివాలయల్లో ఈ నెల 23వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మొదటి రోజు గురువారం సాయంత్రం 3 గంటలకు మండలంలోని నూతనకాల్వలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా అశ్విని

ములకలచెరువు : ములకలచెరువు ఎంపీడీఓగా అశ్విని బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి పనిచేస్తున్న ఎంపీడీఓ పోలప్ప సెలవుపై వెళ్లినట్లు అధికారులు తెలిపారు. మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అశ్విని పేర్కొన్నారు.

ప్రజాసంక్షేమం కోసమే 'గడప గడపకు మన ప్రభుత్వం'


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ప్రజాసంక్షేమం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని కొత్తవారిపల్లె-2 దుబ్బిగానిపల్లె పంచాయతీ గొల్లపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ నాలుగన్నరేళ్ల పాలనలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి తమ ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని ప్రజలు దీవించారు. స్థానికులు ప్రస్తావించిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ జి.వెంకటరమణ, ఎంపీటీసీ ప్రియాంక, సుధాకర్, నాయకులు వెలుగుచంద్ర, మండల కన్వీనర్ దండు కరుణాకరరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ పోతబోలునాగరాజ, బావాజాన్, రమేష్‌బాబు, రామమూర్తి, సోము, వినోద్, గోవా, నారాయణరెడ్డి, వైఎస్ బాబు, మిలటరీ, పాలరెడ్డెప్ప, అమర తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

మదనపల్లె సిటీ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను బుధవారం ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్న గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. శాఖ గ్రంథాలయ అధికారి వసంతకుమారి మాట్లాడుతూ 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారులన స్మరించడం, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు పోటీలు, 19న దిశ చట్టం గురించి చర్చ, 20న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత కమిషనర్ సహదేవరావు, ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి, గొల్లపూడి తిరుపతిరావు, శకుంతలమ్మ, రెడ్డప్ప, యుగంధరాచారి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి

- వడ్డెర్లను అన్ని రకాలుగా ఆదుకుంది వైఎస్సార్ కుటుంబమే
- వడ్డెర్ల కమ్యూనిటీ హాల్‌కు ఎంపీ సొంత నిధులు రూ. 10 లక్షలు
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


వడ్డెర్ల సంఘం నాయకులతో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వేర్ హౌస్ గోడౌన్ ప్రాంగణంలో వడ్డెర్ల చైతన్యసభ నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి వడ్డెర్లు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్డెర్లు 30 లక్షల మంది జనాభా ఉన్నారని తెలిపారు. అన్ని వృత్తుల కంటే వడ్డెర్ల వృత్తి చాలా కష్టమైందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న వడ్డెర్ల సమస్యలను చట్ట సభల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. వడ్డెర్ల కోరిక మేరకు కమ్యూనిటీ భవనం నిర్మాణం కోసం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి సొంత నిధులు రూ. 10 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన వడ్డెర్లందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. వడ్డెర్ల కుటుంబాలకు రూ. 10 వేలు ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో వడ్డెర్లకు మూడు కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చినట్లు చెప్పారు. నిరంతరం చేతి వృత్తులపై ఆధారపడి ఉన్న వడ్డెర్లకు ఉచిత ప్రమాద బీమా వర్తింపజేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ హయాంలో బీసీలను కేవలం ఓట్లకోసం మాత్రమే వాడుకుని వారి సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. వడ్డెర్లను ఆదుకుంది వైఎస్సార్ కుటుంబమే అన్నారు. మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, ముస్లిం మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర వడ్డెర జేఏసీ చైర్మన్ వేముల సుబ్బారావు, ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీకాంతయ్య, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బత్తల వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, ఏపీ వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజమ్మ, బీసీ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు బాలరాజు, బత్తల హరిప్రసాద్, రాజ్‌బహదూర్ పాల్గొన్నారు.

రూ.1.90 కోట్లతో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

మండలంలోని వేపులబైలు పంచాయతీ గాజులవారిపల్లెకు రూ. 1.90 కోట్లతో పీలేరు-మదనపల్లె రోడ్డు నుంచి తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం అడవిపల్లె రిజర్వాయర్ ముంపు బాధితులకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో 119 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారు. అడవిపల్లె ముంపు బాధితులను గత ప్రభుత్వం విస్మరిస్తే, జగనన్న ప్రభుత్వం అండగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ చెంగల్‌రాయుడు, నాయకులు పవన్‌కుమార్, అడవిపల్లె రాజన్న, రమేష్‌రెడ్డి, భవనం వెంకటరమణారెడ్డి, నాగభూషణంరెడ్డి, దండు జగన్‌మోహన్‌రెడ్డి, షఫీ, డాక్టర్ హబీబ్‌బాషా, ఎ.ఎస్. హుమయూన్ తదితరులు పాల్గొన్నారు.

కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలి


మాట్లాడుతున్న ఎస్. జాబీర్

కేవీపల్లె : విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల నుంచి బయటపడేందుకు కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. జాబీర్, ట్రెజరర్ బి. చంద్రశేఖర్ కోరారు. బుధవారం మండలంలోని గ్యారంపల్లెలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 117 జీఓ ద్వారా ఆరు రకాల స్కూళ్లను ప్రవేశపెట్టినందు వల్ల ప్రాథమిక విద్య దెబ్బతిందని తెలిపారు. ప్రభుత్వ కామన్‌స్కూల్ విధానాన్ని అమలు చేసి విద్యావ్యవస్థను చక్కదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ చిత్తూరు జిల్లా గౌరవాధ్యక్షుడు జి. రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శి అక్రంబాషా, మండల గౌరవాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, అధ్యక్షుడు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు. ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


డ్రోన్ వినియోగంతో బహుళ ప్రయోజనాలు


డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వై.వి.రమణరావు

పీలేరు రూరల్ : డ్రోన్ వినియోగంతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చని పీలేరు ఏడీఏ వై.వి. రమణరావు అన్నారు. బుధవారం మండలంలోని దొడ్డిపల్లె రైతు భరోసా కేంద్రం పరిధిలో వరిపొలాలపై డ్రోన్లతో పిచికారీ ప్రయోగం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడం వల్ల సమయం ఆదా కావడంతోపాటు ఖర్చు తగ్గుతుందన్నారు. రూ. 10 లక్షలు విలువ చేసే డ్రోన్ యంత్రంపై డిప్లమా ఇన్ అగ్రికల్చర్ చదివిన వారు పైలట్‌గా ఎంచుకున్నట్లయితే 50 శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. డ్రోన్ల ద్వారా పిచికారీ చేయడం వల్ల విష ప్రభావం ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓలు శ్రావణి, రమాదేవి, కరుణాకర్‌రెడ్డి, గరుడ కంపెనీ టెక్నికల్ మేనేజర్ దిలీప్, దొడ్డిపల్లె మ్యాప్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, వీఆర్‌ఓ సురేష్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి సిద్ధయ్య, ఏఈఓలు, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార

బస్సు యాత్రను విజయవంతం చేయండి


వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు : ములకలచెరువులో ఈ నెల 10వ తేదీ శుక్రవారం జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వారితో ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రులు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఈ బస్సు యాత్రలో పాల్గొంటారన్నారు. పీటీయం నుంచి ములకలచెరువు వరకు ఈ యాత్ర ఉంటుందన్నారు. ములకలచెరువులో బహిరంగ సభ నిర్వహిస్తారని చెప్పారు. పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు పాల్గొనే విధంగా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలి

పెద్దతిప్పసముద్రం : పెద్దతిప్పసముద్రం మండల కేంద్రం నుంచి శుక్రవారం ప్రారంభమయ్యే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం మండల, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు అన్ని పంచాయతీల్లో పర్యటించి వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమయ్యారు. ములకలచెరువులో జరిగే బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

భారీ సంఖ్యలో తరలి రావాలి

కురబలకోట: ఈనెల 10న ములకలచెరువులో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎంపీపీ బి. దస్తగిరి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి పార్టీ శ్రేణులను కోరారు. బుధవారం కురబలకోటలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నాలుగన్నరేళ్లలో నియోజక వర్గం ఊహించని అభివృద్ధి సాధించిందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పార్టీ శ్రేణులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సామాజిక వర్గం పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొనే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు.

ఊటుగోల్లపల్లి రోడ్డుకు మహర్దశ

రామసముద్రం : రామసముద్రం పంచాయతీలోని ఊటుగోల్లపల్లి రోడ్డుకు మహర్దశ వచ్చిందని వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ భాస్కర్‌గౌడ్ తెలిపారు. బుధవారం సుమారు రూ.86 లక్షలతో మంజూరైన ఊటుగోల్లపల్లి రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊటుగోల్లపల్లి రోడ్డు వర్షం పడి చెరువులు మొరవ వస్తే గ్రామంలో ఉన్న ప్రజల పరిస్థితి చాలా దయనీయంగా ఉండటంతో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి , ఎమ్మెల్యే నవాజ్‌బాషాలు రోడ్డు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మస్తాన్, నాయకులు దొడ్డిపల్లి ఆనంద్, గెవన్న, సమీ, కృష్ణప్ప, శివ, ఆనంద, ఆదెప్ప, భాస్కర, చింతలమంజు, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తంబళ్లపల్లె : గుండెపోటుతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తదితరులు పరామర్శించారు. గోపిదిన్నె దళితవాడకు చెందిన ఎంపీటీసీ సభ్యురాలు జయమ్మ భర్త రెడ్డెప్ప(47) మంగళవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మండల అభివృద్ధికమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బెంగళూరు మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ సురేంద్రనాథ్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు.

నేడు నడిమిచెర్లలో ఎమ్మెల్యే పర్యటన

కలకడ : మండలంలోని నడిమిచెర్ల పంచాయతీలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం పర్యటిస్తారని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి నడిమిచెర్ల పంచాయతీ కొత్తపల్లె, అగ్రహారం, వడ్డిపల్లె గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్రం మార్కెటింగ్

రామాపురం : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కేంద్ర మార్కెటింగ్‌తో అనుసంధానం జరుగుతుందని రాష్ట్రస్థాయి ప్రకృతి వ్యవసాయ ఉత్తమ రైతు శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. గత ఆరు సంవత్సరాలుగా జిల్లా స్థాయిలో ప్రకృతి వ్యవసాయం నలుమూలల రైతులతో వ్యవసాయం ముందుకు వెళ్తూ మంచి దిగుబడులు అందిస్తోందన్నారు. ఇందులో భాగంగా ఎం.శ్రీనాథరెడ్డి రాష్ట్ర స్థాయిలో ఐసీసీ ఆర్ పూస క్యాంపస్ ఢిల్లీలో హోం శాఖ మంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు కేంద్రం అనుసంధానం చేస్తోందన్నారు.

క్రైస్తవులు సీఎం జగన్‌కు అండగా నిలవాలి


పాస్టర్ల సమావేశంలో బోనాస్ జాన్ బాబు

బి.కొత్తకోట : క్రైస్తవులు సీఎం జగన్ ప్రభుత్వానికి అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా క్రైస్తవ విభాగం చైర్మన్ బోనాస్ జాన్ బాబు కోరారు. బుధవారం ఆయన మండలంలోని గోళ్లపల్లె (షాలేంపురం) లివింగ్ గాడ్ చర్చిలో వివిధ ప్రాంతాల క్రైస్తవ పాస్టర్లు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా క్రైస్తవ పాస్టర్లకు గౌరవ వేతనం ఇస్తున్న ఘనత జగన్‌దేనన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలని ఇదివరకే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారన్నారు. జెరూసలేం వెళ్లే యాత్రికులకు ప్రభుత్వ సాయం పెంచిందన్నారు. క్రైస్తవుల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పని చేసే ప్రభుత్వాన్ని ఆదరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈనెల 10న ములకలచెరువులో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రలో క్రైస్తవులందరూ విశేష సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పాస్టర్లు సుధాకర్, బెంజిమెన్, ఇబ్రాయిల్, గోపాల్,రెడ్డి శేఖర్, దివాకర్, సుబ్రమణ్యం, చిన్నప్ప, గాబ్రియేల్, పాల్, రవి, శ్రీనివాసులు, నారాయణ, రామకృష్ణ, బయ్యారెడ్డి, శ్యాముల్, జాన్‌వెస్లీ, జాన్ సీనా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పల్లెకు పోదాం' కార్యక్రమం


మాట్లాడుతున్న ఎంపీడీఓ నారాయణస్వామి

రామసముద్రం : మండలంలో ఈనెల 9వ తేదీ నుంచి 23 వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డులు ఆవిష్కరణలో భాగంగా పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నారాయణస్వామి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డులు ఆవిష్కరణ చేసి పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించి విజయవంతం చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించేందుకు నోడల్ అధికారిగా మండల ఈఓపీఆర్‌డీ సుధాకర్‌రెడ్డిని నియమించినట్లు చెప్పారు. ఈనెల 9వ తేదీన రామసముద్రం, 10 న ఆర్.నడింపల్లి, 14న పెద్దకుపర్పల్లె, 15న మూగవాడి, 16న మినికి, 17న మాలేనత్తం, 20న అరికెల, 21 న చెంబకూరు, 22న చొక్కాండ్లపల్లి, 23న ఎలవానెల్లూరు సచివాలయాల్లో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలి



బాలికల కాలేజీ వద్ద నిరసన తెలియజేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

మదనపల్లె సిటీ : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ సంయుక్త ఆధ్వర్యంలో మదనపల్లె పట్టణంలో కాలేజీలు, పాఠశాలల బంద్ కార్యక్రమం జరిగింది. విద్యార్థి సంఘ నాయకులు పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మూయించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ వద్ద ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్‌లు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని నిరసనలు చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు ఓబులేసు, వినయ్, కమల్, భవ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం

రామసముద్రం : రామసముద్రంలో బుధవారం నిర్వహించిన విద్యా సంస్థల బంద్ పాక్షికంగా ప్రశాంతంగా జరిగింది.

'ప్రజా రక్షణ భేరి'ని విజయవంతం చేయండి

రాయచోటి అర్బన్ : పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక రాజకీయాలకు నిరసనగా ఈనెల 15న విజయవాడలో నిర్వహింప తలపెట్టిన ప్రజారక్షణ భేరి బహిరంగసభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఆయన సీపీఎం నేతలతో కలసి ప్రజా రక్షణభేరి ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక రాజకీయాలను రాష్ట్రంలోని పాలక, ప్రతిపక్షాల నేతలు బలపరుస్తున్నారన్నారు.